# శైశవగీతం

లల్లాదేవి




రామాలాలీ

మేఘశ్యామా లాలీ!

తామ రసనయన

ధశరథ తనయా లాలీ!

తొలుత బ్రహ్మాండంబు

తొట్టి గావించీ...

ఆ తల్లి గుండెల్ని చీల్చుకొని వస్తోంది లాలి పాట!

ఊరి చివర పాడుబడిన కొంప. ఎదురుగా తారు రోడ్డు ప్రక్కనే దిశాంతాలకు చేతులు చాచినట్లున్న చింతచెట్టు.

ఆ మాతృమూర్తి గుండెల్లో దాచుకున్న విషాదం పాటగా కరిగి గొంతులోంచి జారుతోంది. అయినా శిశువు ఆదమరిచి నిదురించలేదు.

అది చిత్ర నిద్రలో పూర్వ జన్మ స్మృతుల్ని నెమరువేసే మృదులమైన చప్పుడు కాదు. లేలేత కంఠ నాళాలు చిరిగి పోయేలా చేసే రోదనం! సృష్టిలోని విషాదాన్నంతా మూట కట్టినట్లు నిర్విరామంగా సాగుతోంది.

తల్లి పాడే పాట అప్పుడప్పుడే ప్రపంచాన్ని చూడటం నేర్చుకొంటున్న పాపాయిని ఓదార్చ లేదు. దిక్కులు పిక్కటిల్లుతున్నాయి. మాతా శిశువుల రోదన గీతాలను విని చెట్టు మీదికి చేరిన పక్షులు నోళ్ళు మూశాయి.

రాత్రిందివాలు రవిచంద్రులాడుకొనే దేబూచులాటలో వగటి ప్రొద్దు అశాంత మవుతోంది. నంధ్యా తిమిరాలు వరుచుకుంటున్నాయి.

"ఊరుకోవే చిన్నారీ! ఊకోమ్మా! ఓదార్పు మాటలు, లాలి పాటలు తప్ప నీ కేమివ్వ గలను? కన్నతల్లి కడుపు కోత ఆరువెలలైనా నిండని నీకెలా అర్థమవుతుందిలే!

లాలిజో...లాలిజో...అమ్మో నా బిడ్డ! గుక్క తిప్పులేకపోతోంది. అయ్యో...అయ్యో!!"ఆమె స్వగతం అలా సాగిపోతోంది.

పాపాయిని చేతుల్లోకి తీసుకుంది. చీలి బీటలు వారుతున్న గుండెలకు హత్తుకుంది.

"ఊరుకోవే నా తల్లీ! చేతుల్లో పట్టుకుంది. అయినా శిశువు రోదనం ఆగిపోలేదు.

"వసిబిడ్డ ఏడుస్తుంటే కాసిని పాలిచ్చి నోరు మూయించాలి. నిద్ర పుచ్చాలి. కాని లాలి పాడి జోకొడితే దాని కడుపు నిండుతుందా? నడిమంత్రపు సిరులు కాకపోతే ఏమిటిది? బిడ్డకు పాలిచ్చుకోమని తల్లికి ఎవరైనా చెప్పాలా?" ప్రక్కనే సోమరిగా తూగుతున్న నిద్ర నగం చాలించి తల ఎత్తి ఈసడించాడు ఓ వృద్ధుడు.

కావేరికి కన్నీరు కృష్ణమ్మలా పొంగింది.

"మాలాగా పాపాలు చేసుకు పుట్టిన వాళ్ళకి పాలిచ్చుకునే అదృష్టం ఉందా తాతా! అన్నం తిని మూడు రోజులయింది. నేనేం చేయను? శరీరంలో ఆకలితో మరుగుతున్న రక్తమే కాని పాలు ఎక్కడున్నాయి?" కావేరి. కంఠం జీరపోతోంది.

"తల్లి పాలు చాలకపోతే పోత పాలయినా పట్టాలి కాని వసిబిడ్డని అలా ఎండబెట్టుకుంటారా? అయినా ఉబుసు పోక చెప్పాను. ఊళ్ళో సంగతులు ఉడత కెందుకులే! అంటూ మరో వంకకు తిరిగి ముసుగు తన్నాడు వృద్ధుడు.

వెక్కి వెక్కి ఏడుస్తోంది కావేరి. బిడ్డని పట్టుకోవడం అసాధ్యమవుతోంది. ఆకలితో మెలికలు తిరిగిపోతోంది. గుక్క తిప్పుకోలేక సతమత మవుతోంది. అమ్మ పట్టి అలాగే బిగుసుకు పోతుందేమో!

ఏం చెయ్యాలి? ఎలా? ఎలా?

తుఫానులో ఓ చిన్న ఆధారంలా, వరదలో కొయ్య తెప్పలా, మంట గాలిలో చెట్టు నీడలా ఉదయం రామచంద్రుడు వనిలోకి వెడుతూ చెప్పిన మాటలు గుర్తొచ్చాయి.

"కావేరీ! నీ మీదొట్టు, నీ బిడ్డ మీదొట్టు! ఇవాళ నుంచి కూలి డబ్బులు ఇంటికే తెస్తాను. పాల పొడి కొంటాను. పాల పీక కూడా కొంటాను. ఇద్దరం కూచుని పాపాయికి కడుపు నిండా పాలు తాగించేద్దాం! ఓకే. గుర్తుంచుకుంటావు కదా! పెందరాడే తిరిగొస్తాను. ఎదురు చూస్తుంటావు కదా!"

ఎన్నాళ్ళ కెన్నాళ్ళకి మురిపాలు! కడుపు నిండా పాలు తాగితే పాపాయికి ఎంత హాయి! అది ఒక్క చిరునవ్వు నవ్వితే కన్న కడుపుకి ఎంత తృప్తి! "అలాగే వనిలోకి వెళ్ళు కుక్క తోక వంకరలా చేయకు మళ్ళీ నా దగ్గర పాలు లేవు. మూడు రోజులుగా అది ఒకటేఏడుపు. దాని బోసి నవ్వు చూసి యుగాలయినట్టుంది. నేనింకా నాలుగు రోజులు వస్తుంటాను చందూ! ఒక్కసారిపాల పొడి తీసుకురా"

బిడ్డ మీదిమమకారం అది. ఎంతకీచావని ఆశతో మొరపెట్టు కుం దా తల్లి

"అలాగే! అలాగే! గంజి మొత్తం నా కారియర్ లో పోసి నట్టున్నావు కదా! అయ్యో పాపం, నీకు లేవు. సరిలే! నేనెళ్ళొస్తాను. ఆ కారియర్ ఇలా ఇవ్వు" కారియర్ తీసుకుని వెళ్ళిపాయాడు రామచంద్రుడు.

గంజి తాగి మూడు రోజు లయింది కానీ, కట్టుకున్న వాడే కసాయి వాడిలా బాలెంతరాలి ఆకలి తీర్చకుండా ఉన్న గంజి నీళ్ళన్నీ పట్టుకు పోయాడన్న బాధ కానీ ఆమెను కదిలించ లేక పోతున్నాయి.

సాయంత్రం వస్తూ పాల పొడి తెస్తే, కడుపు నిండా పాలు తాగిన పాపాయి నవ్వ బోయే చిరునవ్వు తలుచుకుని తృప్తి పడిం దా పిచ్చి తల్లి. ఇప్పుడు ఆ మాటలే జ్ఞావకం వచ్చాయి.

రోడ్డు వంక చూసింది ఆశగా! కొందరు కూలీలు సైకిల్స్ మీదపోతున్నారు. అంటే వని లోంచి బయట వడ్డారన్న మాట. ఈ రోజు వారంబట్వాడా.

నడిచి వచ్చే వాళ్ళు కొంచెం వెనగ్గా వస్తారు.అవును మరి అంతదూరం నుంచి నడిచిరావద్దూ?

రోడ్డు మీద పాకుతూ ఆశతో నిండిన చూపులు పైకి ఇంకా పైకి, చీకటిలో కనిపించని దూరానికి తావత్రయంతో వరుగెడుతున్నాయి. చేతిలో పాప ఏడుస్తూనే ఉంది. కాసేవు ఒక్క అర నిముషమైనా ఏడుపు మానేస్తే ఎంత మేలు? కానిఎలా?

రొమ్ము నోటికి అందిస్తే ఆబగాపీల్చేసే పావ, పాల సీసా పెదాల కందిస్తే నిముషంలో ఖాళీ చేసేపావ నిన్న మధ్యాహ్నం నించి చుక్కయినా ఎరగదు. మరి ఏడవదూ? దిక్కు మాలిన ఆ దేవుడు ఆకలి నెందుకు సృష్టించాడో అభం శుభం తెలియని చిన్నారి దేవతలు శిశువులు - వారు ఆకలితో అల్లిడితల్లిడి అవుతొంటే చూడటంఅతనికి వేడుక కాబోలు! ఎంత నిర్దయుడు!

"బాబూ! బాబూ! నా చందూ వస్తున్నాడా?"బట్వాడా తీసుకున్న ఉత్సాహంతో జోరుగా సైకిలు తొక్కుతూపోతున్న యువ హమాలీని అడగింది కావేరి.

సైకిల్ చిన్న జర్క్ ఇచ్చి ఆగింది. అతను బొటనవేలు నేలకు తాకించి కళ్ళుచికిలించి చూచాడు.

"ఎవరు? చందూ? ఓ రామచంద్రుడా! బట్వాడా అందిందికదా! ఇప్పుడెందు కొస్తాడు?" వెటకారంగా నవ్వుకుంటూ వెళ్ళి పోయాడు జోరుగా!

ఒక్క సారిగా ఆశలన్నీ క్రుంగి పోతున్నాయి. ఆలోచనలు ఉల్కల్లా దబ్బుమని నేలమీదకి రాలి వడ్డాయి. నవనాడులూ భూమి లోపలికి చొచ్చుకు పోతున్నాయి.

"ఇవాళ కూడా అలా చేస్తాడా చందూ! ఎందుకు చేస్తాడు? తనది మాత్రం కన్న తండ్రి మనసు కదా! ఈ బిడ్డ తనదికూడా కాదా! ఆత్మలో ఆత్మ! ఆత్మ వంచన చేసుకుంటాడా చందూ!"

ఆమెలో ఆశలు మళ్ళీ మొగ్గలు తొడుగుతున్నాయి. ఆశ చిరంజీవి! అది మనిషికి ఆరవ ప్రాణం! అది లేని నాడు జీవితమే శూన్యం! ఎంత ప్రతి కూలమైన వాతావరణంలో అయినా చిగురించి మొగ్గ తొడగాలని చూచే ఏకైక మొండి భావం ఆశ! అదిలేనినాడు మనిషికి మనుగడే లేదు.

ఆశా పాశము తా డున్నిడువు; లేదంతంబు... డిగ్రీ చదువు తున్న రోజుల్లో తెలుగు మాస్టారు చెప్పిన పాఠం మనసు పొరల మీదకిపాకి వచ్చింద.

"అవును. చందూ వస్తాడు. నా కోసం కాదు. బిడ్డ కోసం" అనుకుని కన్నులు చికిలించి చూసింది దూరానికి.

ఎవరో వస్తున్నారు. చందూయేనా?

అవునా? అవునవును.అయ్యో కాదులా. గుంది.కాసేవు నరకప్రాయమైన టెన్షన్తో మనసుఊగిన లాడింది.


కాదు. చందూ కాదు.

స్లివ్పర్స్ మోత వినిపిస్తోంది.

చందూకి చెప్పు లెక్కడున్నాయి?

కాలేజీలో యూనియన్ లీడర్గా ఎన్నికైనరోజున కొన్న అంబాసిడర్ ఆ తరువాత ఇల్లు కదిలి ఇలా వచ్చాక దరిద్రపు వడగాలి సోకి చివికి చీలికలు వాలినవైపో ఆపూటవండుకునేందుకు

నూకల్లేకసెకండ్హాండ్ షాపులో చూపిస్తే



అర్ధరూపాయి వచ్చింది. అలాంటి చందూపాదాలు ఇవాళ ఎలా ఉన్నాయి? చెప్పులచప్పుడు దగ్గరయింది. "చాచా? చందూవస్తున్నాడా?" వేయియుగాల విరాళితో ఆత్మవరమాత్మకై చేస్తున్నపరివేదనం ఆప్రశ్నలో !

"ఎవరూ చందూనా? టౌన్‌కివెళ్ళాడు" ఒర్పుగానే సమాధానం ఇచ్చిన వ్యక్తి తాల్లుకు అడుగుల చప్పుడుదూ రమవుతోంది. ఆ పాదాల బరువు రోడ్డు మీదకాదు తన గుండెల మీదుగాపోతున్నట్లనిపిస్తోంది.

ఏం జరిగింది? గాడ్! ఏంజరిగింది? చందూ? కన్నబిడ్డను బలి ఇచ్చుకుంటావా? నో అలాజరగదు. చందూ వస్తాడు. అవునుమరి? టౌన్‌లోకివెళ్ళందే .పాలపొడి ఎలా వస్తుంది? పాలపొడికొనేందుకే పట్నంలోకి వెళ్ళాడు చందూ.

అంతేకావచ్చు

ఏడుస్తున్న పాపాయిని మళ్ళీ ఓదార్చాలని ప్రయత్నస్తోంది. దాని గొంతులో స్వరపేటిక చుట్టూఉన్న పలుచని పొరలు తెగిపోయి ఉంటాయి. కంఠస్వరం మారింది. ప్రక్కటెముకలు ఎగిరెగిరి పడుతున్నాయి.

భగవంతుడా ఏమి టీ అగ్ని పరీక్ష! ఇకఆగేలా లేదు. దాని గొంతు తడపాలి. ఎలాగైనా ఎలాగైనాసరే

పైట కొంగుని నీళ్ళతో తడుపుకుంది కావేరి. చిరిగిపోయి నామ మాత్రంగా ఉన్న బ్లవుజు హుక్కు తప్పించిది. రోడ్డు వంక వెన్ను చూపి చెట్టుచాటుకి తప్పుకుంది.

కన్నబిడ్డ లేత పెదాలు దానిమ్మ పూలరేకుల్లాఉండేవి ఏడ్చి ఏడ్చివాడిపోయిన దానిమ్మపూలరేకుల్లా అయినాయి. ఆ పెదాల మధ్యకు చుంబుకాన్ని అందించింది. ఒళ్ళంతా జల్లు మంది. మాతృభావం ! శిశువుకు స్తన్యమిచ్చే తల్లి ఈ భూమి మీదకనిపించేదేవత కదా!

కంటి వెంట నీళ్ళుకారుతున్నాయి. కన్నీరైనా ఇంకిపోలేదు.

బంగారు బంతుల్లా పైటచాటున ఒదిగి ఉండి సమ్మోహనాస్త్రాల్లా ఒకనాడు విద్యార్థిలోకాన్ని ఉర్రూతలూగించిన వక్షోజాలు

చందూ లక్షలాది రూపాయల ఆస్తిని, ఆత్మీయుల్ని అందర్ని ఒదులుకుని వచ్చేలా చేసిన అందాల సౌధాలు? కాని తిండి లేమివల్ల యిర్రిండి వాడి బెరడుల్లా అయినాయి. చూచుకాలకు ఆర్ద్రతిరాలేదు.

పాపాయి పెదవులు నొచ్చుకున్నాయి. ఒరుసుకున్నాయి. కోపంతో బిగుసుకున్నాయి. ప్రాణాధారాలయిన అమృత క్షీరధారల్ని అందించే పాలిండ్లను పాపాయి తిరస్కరించినది. ఆబగా తాగి కడుపు నింపుకోవాలనుకుంది. కాని ఆర్ద్రతలోపించి ఒరిపిడి చేయడంతో బాధగా ముఖాన్ని మరలించుకుంది. మళ్ళీ ఏడుపు.

"భగవంతుడా నన్నెందుకు పుట్టించావీలోకంలో?" అని ప్రశ్నిస్తున్నట్టుగా పాపాయి ఏడుపు కింద భూమినీ పైన ఆకాశాన్నీ పక్కనున్నదిక్కుల్నీ బద్దలు కొడుతోంది.

దీనురాలైన ఆ తల్లి-దిక్కుమాలిన ఆ తల్లి తిరిగి ముఖం పైకి ఎత్తి రోడ్డు వంకచూస్తోంది. పాపం కడుపునింపలేని తల్లి ఎంత పాపాత్మురాలు? దేవతలారా నన్నెందుకు పుట్టించారు? నా కొక పాప నెందుకిచ్చారు నేనెందుకు బ్రతుకున్నాను?

"టక్...టక్...టక్...

ఆలోచనల నించి, బాధల నించి, బంధనాల నించి తెంచుకుని బయటపడింది మనను.

అవిగో నీడలు! ఎవరో వస్తున్నారు. ఎవరో ఏమిటి? చందూ ఎందుక్కా కూడదూ? అవును చందూయే!

"చందూ! ఓ చందూ! పాపాయికి పాల పొడి తెచ్చావా?" పిచ్చిగా అరిచిందామె. లేచి పరుగు తీసింది.

"అమ్మా! నువ్వేనా చందూ లేపుకొచ్చిన అమ్మాయివి?"

"స్టుపిడ్స్ ఎందుకలా అడుగుతారు" అవును ఎదిరించిన వాళ్ళని సమాజం దూషిస్తుంది. బ్రతికినంతకాలం వేలెత్తి చూపిస్తూనే ఉంటుంది ఇలాగే! ఇలాగే చిత్రవధ చేస్తుంది. ఇంకా ఇద్దరు గ్రాడ్యుయేట్స్‌ని నిరుద్యోగ రక్కసి కోరల్లో ఇరికించి హమాలాలుగా మార్చివేస్తుంది. అయినా చందూ నా మనిషి!

"అవును బాబూ! చందూ భార్యని నేనే! ఎక్కడ నా చందూ?"

"భార్య వే బండరాయివే! చందూని హాస్పిటల్‌కి తీసుకు పోతున్నారు. పో! పో! నువ్వు కూడా త్వరగా పో!"

"అయ్యో! నా చందూకి ఏమయింది?"

"ఆస్పత్రికి పోవమ్మా! ఈ కథలన్నీ ఎవరు చెప్తారు. పావం లెమ్మని వార్త తెచ్చాం చాలదా? వివరాలు మాకు తెలియవు".

మనుమట మిధ్య మనుమల హృదయాలు మిధ్య బంధాలూ, బంధుత్వాలూ తెగిపోతున్నాయి. "రిలేషన్ బిట్వీన్‌హార్ట్స్? నో ఇట్స్‌పాల్స్!

పరుగెడుతోంది. తారలా, ఉల్కలా, భూమిలో చొచ్చుకు పోతున్న పిడుగు ముక్కలా.

రోడ్డు మీద జనం...జనం...రక్తం మడుగు. ప్రక్కనే పగిలిపోయిన పాల బుడ్డి. పాపాయి ప్రాణం మట్టి పాలయిందా?

"పో తల్లీ త్వరగా పో! అటూ ఇటూ అవుతున్నాడు. రక్తం పోయింది. తల పగిలింది." వివరాలు అందిస్తున్నారు.

వింటోంది. పరుగెడుతోంది. ఆ కుదుపులకి వెక్కి వెక్కి ఏడుస్తోంది పాపాయి. డొక్కలోకి ఎగరేస్తోంది.

అదిగో హాస్పిటల్ గేటు! అదుగో ఎమర్జెన్సీ వార్డు. దాని ప్రక్కనే బ్లడ్ బ్యాంక్.

ఎన్ని సార్లు విద్యార్థుల్ని ఒప్పించి ఆ బ్యాంకులో రక్త దానం ఇచ్చాడు చందూ!

"అందర్ నై జానా!" గేటు దగ్గర లాఠీ అడ్డు నిలిచింది. భద్రకాళిలా కన్ను విప్పింది కావేరి. ఒక చేతిలో పాపాయి ఏడుస్తూంది. మరో చేత్తో ఘుర్కాని ఒక్క తోపు తోసింది. పడిపోయాడు.

"యే కైసా బాత్ హై" దుమ్ము దులుపుకుంటున్నాడు.

ఎమర్జెన్సీ వార్డులోకి వెళ్ళింది దూసుకుని.

"ఎవరూ లోపలికి రాకండి. అంతా బయటే!" నర్స్ తలుపులు మూసేస్తోంది.

"అయ్యో! అదేలా? నా భర్త, నా దేవుడు, నా ప్రియుడు, నా ప్రాణం, నా ఆశ, నా జీవితం" ఉన్మాదినిలా అరుస్తోంది కావేరి.

"అదంతా తరువాత. ప్లీజ్ గెటవుట్ తలుపులు మూసేసింది నర్స్!

పాపాయి ఏడుస్తోంది. వింటున్న వాళ్ళు ఆకలయిందనుకున్నారా? లేదు! తండ్రి కోసం కాబోలు. పాపాయి ఏడుస్తోంది. పాల కోసం అనుకున్నారా? కాదు. వచ్చి రక్తంలో దోగాడుతున్న ప్రాణి కోసం.

అరగంట తరువాత తలుపులు తెరుచుకున్నాయి. స్ట్రెచర్ మీద ప్రత్యక్షమైంది చందూ శరీరం. అప్పుడే ప్రాణం పోయింది.

పాపాయిని శవం మీదికి జార్చేసింది కావేరి. హాస్పిటల్ గోడలు నిర్జీవంగా, నిశ్శబ్దంగా చూస్తున్నాయి.

మనసు మొద్దుబారి పోయింది.

తల పగిలినపుడే పాల పొడి సీసా కూడా పగిలింది. రక్తం చిమ్మినట్టే పాల పొడీ చిమ్మింది.

కొద్ది పాల పొడి ఇంకా అతని చేతులకి అంటుకునే ఉంది. తెల్లగా తెల్ల తెల్లగా!

చేజారి తండ్రి మీద పడిన పాపాయి తండ్రి చేతిని నాలుకతో అద్దుతోంది. లాలాజలం కలిసి పాలుగా మారి గొంతు జారుతోంది పాల పొడి.

జన్మనిచ్చిన ఆ తండ్రి ఆశాంతమైపోయాడని తెలియదు. తల్లి జీవితం చీకటి అయిందని కూడా తెలియదు. తన భవిష్యత్తు అర్థం కాదు. కాని ఆకలి తీరుతోంది కదా!

అప్పుడు ఆ తల్లి ఆశ తీర్చింది చిన్ని పాపాయి. తండ్రి చేతి నించి పాల పొడి నాలుకతో అద్దుకుంటూ నవ్వింది పాపాయి. తండ్రి శవం మీద చిరునవ్వుల పూలు విరజిమ్ముతోంది. పాప పుణ్యాలకు అతీతురాలైన ఆ శిశువు! ఆశ ఆ శ్రై 'శవా'నికి ఆగమ గీతాలను ఆలపిస్తోంది.

కాని ఎంతకూ తెల్లవారదేం భగవంతుడా? ★

